క్లుప్తంగా

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



బాలానగర్: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త బర్రె కృష్ణయ్య కుటుంబానికి ప్రముఖ సామాజిక వేత్త, ఎంపీటీసీ అభిమన్యు రెడ్డి రూ.లక్ష ఆర్థికసాయం ప్రకటించారు. ఈ మేరకు వైస్ ఎంపీపీ వెంకటచారి, రైతు బంధు మండల అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి గౌతాపూర్ గ్రామంలో బాధితకుటుంబ సభ్యులకు బుధవారం సదరు నగదు అందజేశారు. సర్పంచ్ రమేష్, గ్రామ పెద్దలు శ్రీనివాస్ రెడ్డి, ప్రకాష్, కుమార్ రెడ్డి, యాదయ్య, సతీష్, గోపి తదితరులు ఉన్నారు.

మాజీ ఎంపీపీ కుటుంబానికి పరామర్శ

నవాబుపేట: మాజీ ఎంపీపీ నారాయణ కుటుంబాన్ని బుధవారం ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పరామర్శించారు. మండల పరిధిలోని కారుకొండ గ్రామానికి చెందిన నారాయణ కుమారుడు రజనికాంత్ బ్యాంకు ఉద్యోగం చేస్తుండేవాడు. కాగా కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న అతడు బుధవారం మృతి చెందాడు. ఎంపీ, ఎమ్మెల్యే అతడి భౌతిక కాయానికి నివాళి అర్పించారు. జెడ్పీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ నర్సింహులు, మార్కెట్ చైర్మన్ లక్ష్మయ్య, ఎంపీపీ అనంతయ్య, ముడా డైరెక్టర్ చెన్నయ్య, మైసమ్మ ఆలయ చైర్మన్ కృష్ణయ్య, నాగిరెడ్డి, పురుషోత్తం, ఎంపీటీసీ గోపాల్, రాంప్రసాద్, రాజ్‌కుమార్ ఉన్నారు.



అడ్డాకుల: జానంపేటకి చెందిన కాంగ్రెస్ కార్యకర్త దాసు తల్లి ఇటీవల అనారోగ్యానికి గురై మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని బుధవారం సాయంత్రం డీసీసీ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి పరామర్శించారు. మృతురాలి కుమారుడు దాసును ఓదార్చి సంతాపం వ్యక్తం చేశారు. అదేవిధంగా ఆర్థిక సాయం అందజేసి అండగా ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొండా జగదీశ్వర్, మాజీ ఎంపీటీసీ బోయ కృష్ణయ్య, వెంకటేష్, రాజు తదితరులు ఉన్నారు.

పిడుగు పాటుకు ఆరు మేకలు మృతి

గండేడ్: పిడుగుపాటుకు ఆరు మేకలు మృతి చెందాయి. వివరాలు ఇలా ఉన్నాయి. సాలార్‌నగర్ గ్రామానికి చెందిన అయ్యనోల్ల చెన్నయ్య రోజువారీలో భాగంగా మేకలను మేపడానికి సాలార్‌నగర్ ప్రాజెక్టు సమీపంలో ఉన్న తన పొలం వద్దకు తీసుకెళ్లాడు. మధ్యాహ్నం మూడున్నర గంటల ప్రాంతంలో ఒక్కసారిగా ఉరుములు మెరుపులతో కూడిన వర్షం ప్రారంభం అయ్యింది. ఈ క్రమంలో చెట్టుపై పిడుగు పడడంతో అక్కడే ఉన్న మేకలు ఆరు మృతి చెందాయి. చెన్నయ్య ప్రమాదం నుంచి బయటపడ్డాడు. దాదాపు రూ.లక్ష నష్టం వాటిల్లిందని ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

నేటి నుంచి చిల్డ్రన్స్ రిట్రీట్

స్టేషన్ మహబూబ్‌నగర్: జీసస్ పవర్ అపోస్తలిక్ మినిస్ట్రీస్ దాసరి సోదరుల ఆధ్వర్యంలో గురువారం నుంచి 3వ తేదీ వరకు జిల్లా కేంద్రంలోని ఏఆర్ గార్డెన్స్‌లో చిల్డ్రన్స్ రిట్రీట్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ప్రతినిధులు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. ఏఆర్.పాల్‌సన్ (జంగారెడ్డిగూడెం), సాదు సుందర్‌సింగ్ (గుంటూరు), జాన్‌సన్ (రాజమండ్రి) పాల్గొని సందేశాలు ఇస్తారని తెలిపారు. ఈ మూడు రోజుల కార్యక్రమంలో బైబిల్ కథలు, దేవుని పాటలు, మ్యాజిక్‌షో, చిన్నారులకు బైబిల్ క్విజ్, కంఠతా వ్యాఖ్యలు, పప్పెట్ షో తదితర అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. అదే విధంగా జీసస్ పవర్ అపోస్తలిక్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో గురువారం, శుక్రవారం రెండు రోజులపాటు ఆశీర్వాద కూడిక కార్యక్రమాలను సాయంత్రం 6 గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు ప్రతినిధులు వివరించారు.

సామాజిక సేవకు సమయం కేటాయించాలి

నారాయణపేట రూరల్: విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసిన ఎండీ నజీర్ మియా ఎంతో మంది ప్రయాణికుల మన్ననలు పొందారని డీఎం ఆంజనేయులు కొనియాడారు. సుదీర్ఘ కాలం పాటు డ్రైవర్‌గా విధులు నిర్వహించడంతో పాటు ఏడీసీగా డిపోలో పనిచేసి పదవి విరమణ పొందిన ఎండీ నజీర్‌మియాను శాలువా, పూలమాలతో సత్కరించి, మెమొంటో అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. శేష జీవితం సామాజిక సేవకు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎఫ్ రాజశేఖర్, సూపరింటెండెంట్ నరేందర్, ఏడీసీలు పీఎస్‌ఎన్ రెడ్డి, నారాయణ, తాత్కాలిక బస్టాండ్ కంట్రోలర్లు రాజేశ్వర్, శ్రీనివాసులు, చాంద్‌పాషా, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపైనే చెత్త



భూత్పూర్ శివారులోని డంపింగ్ యార్డు

- డంపింగ్ యార్డు ఉన్నా వినియోగించని వైనం
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న మున్సిపల్‌సిబ్బంది
- కలెక్టర్, కమిషనర్లకు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

భూత్పూర్: పారిశుద్ధ్య పనులు చేపట్టడంలో మున్సిపల్ సిబ్బంది, అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రచారం కోసమే అన్నట్లు వ్యవహరిస్తున్నారని, క్షేత్రస్థాయిలో పనులు సరిగా చేయించడం లేదని ప్రజలు వాపోతున్నారు. నిధులు కేటాయిస్తున్నా చర్యలు తీసుకోవడం లేదని అంటున్నారు. మున్సిపాలిటీలోని 10 వార్డుల్లో నెలల తరబడి మురుగు కాల్వలు శుభ్రం చేయడం లేదని, దోమల బెడద పెరిగి రోగాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్ మే 19 నుంచి 27 వరకు చేపట్టినా అట్టి పనులు వార్డులకు మాత్రమే పరిమితమయ్యాయని, అక్కడ సైతం నామమాత్రంగా పనులు చేపట్టారని ఆరోపిస్తున్నారు. అదేవిధంగా రోడ్ల వెంటనే సిబ్బంది చెత్త వేస్తున్నారని అంటున్నారు.



రోడ్డుపై దర్శనమిస్తున్న చెత్త

మున్సిపాలిటీ పరిధిలో రహదారుల వెంబడి చెత్త వేస్తున్నారని ప్రజల నుంచి ఫిర్యాదులు రావడంతో రెండేళ్ల క్రితం డంపింగ్ యార్డు నిర్మాణం చేపట్టారు. కానీ మున్సిపల్ సిబ్బంది అందుకోసం కోసం చేపట్టిన గుంతలో చెత్త వేయకుండా వ్యవసాయ పొలాలకు వెళ్లే దారుల్లో, వాల్యాతండా, భగవాన్ అమృతండా, కొత్తూర్ గ్రామానికి వెళ్లే దారి వెంబడి చెత్తను వేస్తున్నారు. ఒకవైపు వెళ్లే దారి సైతం చెత్తతో నింపివేశారు. డంపింగ్ యార్డు కోసం రూ. వేలు ఖర్చు చేసినా వృథాగా మారింది. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో రెండు సార్లు కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించినా చర్యలు చేపట్టలేదు. మున్సిపల్ కమిషనర్‌కు సైతం రెండుసార్లు వినతి పత్రం అందించినా ఎలాంటి ఫలితం కనిపించడం లేదని తండా వాసులు ఆరోపించారు. రాత్రి వేళల్లో పట్టణంలోని చికెన్ సెంటర్ వ్యాపారస్తులు కోళ్ల వ్యర్థాలు సైతం రహదారి పక్కనే వేయడంతో కుక్కలు తమపై దాడి చేస్తున్నాయని, రాత్రివేళల్లో తండాలకు వెళ్లాలంటే భయాందోళనకు గురవుతున్నామని అంటున్నారు.

విషయమై మున్సిపల్ కమిషనర్ నూరుల్ నజీబ్‌ను వివరణ కోరగా రోడ్లపై చెత్త లేకుండా తొలగించామని, చెత్తను డంపింగ్ యార్డులో వేయిస్తున్నామని వివరించారు.

ఇబ్బందులు పడుతున్నాం



తండాకు, పొలాలకు వెళ్లాలంటే దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం. మున్సిపల్ సిబ్బంది దారిలోనే చెత్తను తీసుకొచ్చి వేస్తున్నారు. రాత్రిపూట తండాకు వెళ్లాలంటే కుక్కలు దాడి చేస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలి. డంపింగ్ యార్డును సైతం వేరేచోటకు మార్చాలి.

–రఘు, వాల్యాతండా, భూత్పూర్‌మున్సిపాలిటీ

ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు



పంటపొలాలకు వెళ్లే దారిలో డంపింగ్ ఏర్పాటు చేయడంతో దుర్గంధం భరించలేకపోతున్నాం. చెత్తతో దారిని సైతం మూసివేశారు. కలెక్టర్‌కు రెండుసార్లు, మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేసినా పట్టించుకోవడం లేదు. అధికారుల పర్యవేక్షణ లోపంతో సిబ్బంది చెత్తను ఇష్టానుసారంగా ఎక్కడపడితే అక్కడ వేస్తున్నారు. వార్డు ఆఫీసర్లు సైతం కన్పించడం లేదు. డంపింగ్ యార్డులో చెత్త వేయకుండా రోడ్లపై వేస్తున్నారు. కలెక్టర్ స్పందించి యార్డులో చెత్త వేసేలా చర్యలు తీసుకోవాలి.

–తరుణ్, భూత్పూర్ మున్సిపాలిటీ

ధూమపానంతో ఆరోగ్యానికి చేటు



భూత్పూర్ చౌరస్తాలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

భూత్పూర్: ధూమపానం ఆరోగ్యానికి చేటు చేస్తుందని వైద్యాధికారి డా.హిమబిందు అన్నారు. బుధవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం డా.హిమబిందు మాట్లాడుతూ బీడీలు, సిగరెట్లు, పొగాకు వల్ల క్యాన్సర్‌తో పాటు శరీరంలోని ఊపిరితిత్తులు, గుండె, మూత్ర పిండాలు ఇతర శరీర భాగాలు పాడవుతాయన్నారు. ప్రభుత్వ విద్యాలయాలు తదితర చోట్ల పొగాకుపై నిషేదం ఉన్నా పరిగణనలోకి తీసుకోవడం లేదని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అదనపు అధికారి డా.భాస్కర్‌నాయక్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డా.శంకర్, జిల్లా ఎన్సీడీ ప్రోగ్రామ్ ఆఫీసర్ డా.సంధ్య కిరణ్మయి, కోఆర్డినేటర్ నాగరాజు శెట్టి, జిల్లా కంటి వెలుగు ప్రోగ్రాం కోఆర్డినేటర్ దత్తాత్రేయ, వైద్యాధికారి డా. అబ్దుల్ రబ్, డా.హిమబిందు, సీహెచ్‌వో రామయ్య, హెల్త్ అసిస్టెంట్‌లు ప్రమోద్‌కుమార్, శ్రీనివాసలు, వైద్య సిబ్బంది ఉన్నారు.

దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలి

గండేడ్: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఉత్సవాలపై సర్పంచులు, ఎంపీటీసీలు, మండలస్థాయి అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. జూన్ 2 నుంచి 22కు ఉత్సవాలు ఉంటాయని ప్రాధాన్యతల వారీగా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమ నిర్వహణలో బాధ్యతగా వ్యవహరించాలన్నారు. జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ రూపేందర్‌రెడ్డి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ మగ్దుమ్ హుస్సేన్, ఎంపీఈఓ శంకర్‌నాయక్, మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

రాజాపూర్: దశాబ్ది ఉత్సవాలను గ్రామ గ్రామాన విజయవంతం చేసుకుందామని ఎంపీపీ సుశీల, ఎంపీడీఓ లక్ష్మీదేవి సూచించారు. ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులతో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మండల వ్యవసాయ అధికారి నరేందర్, వివిధ తదితరులు పాల్గొన్నారు.



రాజాపూర్‌లో మాట్లాడుతున్న ఎంపీపీ సుశీల

ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహిద్దాం

స్టేషన్ మహబూబ్‌నగర్: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 2న రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం 9.30 గంటలకు జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరణ ఉంటుందని పేర్కొన్నారు. కార్యాలయం నుంచి నాయకులు, కార్యకర్తలతో కలిసి ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు. ర్యాలీ పార్టీ కార్యాలయం నుంచి ప్రారంభమై ఆర్టీసీ బస్టాండ్, అంబేడ్కర్ చౌరస్తా, అశోక్‌టాకీస్ చౌరస్తా మీదుగా క్లాక్‌టవర్ వరకు ఉంటుందన్నారు. అక్కడ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను నెరవేర్చిన సోనియాగాంధీకి కృతజ్ఞత తెలిపే కార్యక్రమం ఉంటుందని, చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. అదే విధంగా జిల్లాలోని మండలాల్లోనూ వేడుకలు ఘనంగా నిర్వహించాలని వివరించారు.

క్వింటాలుకు కిలో తరుగు

రాజాపూర్: ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని విక్రయిస్తే రైసుమిల్లుల యజమానులు తాలు పేరుతో క్వింటాలుకు కిలో కటింగ్ చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. మండలంలోని కల్లేపల్లి రైతులు గ్రామంలో ఏర్పాటు చేసిన ఐకేపీ కొనుగోలు కేంద్రంలో వరిధాన్యాన్ని బుధవారం విక్రయించారు. అట్టిధ్యాన్యాన్ని లారీలో లోడ్ చేసి జడ్చర్లలోని లక్ష్మీరాజేందర్ రైసుమిల్లుకు పంపించారు. కాగా రైసుమిల్లు యాజమాన్యం కిలో కటింగ్‌కు ఒప్పుకుంటేనే లారీ అన్‌లోడ్ చేస్తామని ఐకేపి అధికారులకు తెలియజేశారు. దీంతో వారు రైతులకు అదే విషయాన్ని తెలియజేశారు. ఇబ్బందులు పెట్టకుండా కొనుగోలు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలంటున్నారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు



దేవరకద్ర: మండల కేంద్రంలోని రాయచూర్ రోడ్‌లో అసంపూర్తిగా ఉన్న వీరప్పయ్య దేవస్థానం షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ బాధితులు చేపట్టిన రిలే దీక్షలు బుధవారం నాలుగో రోజుకు చేరుకున్నాయి. నాలుగేళ్ల క్రితం ఒక్కో షాపునకు రూ. 4 లక్షలు అడ్వాన్స్‌గా మొత్తం 54 షాపులకు రూ. 2.16 కోట్లు చెల్లించినా ఇప్పటికీ నిర్మించలేదని తెలిపారు. ఎండోమెంట్ అధికారులు స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

ఘనంగా ప్రతిష్ఠాపన ఉత్సవాలు



చెల్మిల్లలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

గండేడ్: చెల్మిల్లలో పలు ప్రతిష్ఠాపన ఉత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆంజనేయ స్వామి ఆలయ పున:ప్రతిష్ఠాపన, గణపతి, నవగ్రహ, బొడ్రాయి, అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఉత్సవాల్లో ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. రూ. 25వేలు, రూ.51వేలు, రూ.30వేలు చొప్పున ఆలయ అభివృద్ధికి ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పెంట్యానాయక్, ఆర్‌ఎస్‌ఎస్ చైర్మన్ గోపాల్, సర్పంచ్ ఖాజప్ప, ఆశిరెడ్డి పాల్గొన్నారు.

జిమ్నాస్టిక్స్‌లో రజత పతకం

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లో జరుగుతున్న రాష్ట్రస్థాయి సీఎం కప్ టోర్నీలో జిల్లా క్రీడాకారులు మెరుగైన ప్రదర్శన కనబరుస్తున్నారు. జిమ్నాస్టిక్స్‌లో జిల్లాకు చెందిన క్రీడాకారుడు జి.విజయ్‌కుమార్ రాణించాడు. టేబుల్ వాల్ట్ విభాగంలో రజత పతకం సాధించాడు. ఈ సందర్భంగా పలువురు అభినందించారు.



విజయ్‌కుమార్

అర్హులందరికీ ఇళ్లు ఇస్తాం

జడ్చర్ల: అర్హులైన ప్రతి ఒక్కరికీ డబుల్ బెడ్ రూం ఇళ్లు అందేవిధంగా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే డాక్టర్ సి.లక్ష్మారెడ్డి తెలిపారు. బాదేపల్లి శివారులోని ఎర్రగుట్ట ప్రాంతంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ఆయన బుధవారం పరిశీలించారు. ఇళ్ల పంపిణీకి కావలసిన అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ఇప్పటికే జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని కావేరమ్మపేట, బాదేపల్లిలోని పాతబజార్, నిమ్మబాయి గడ్డ తదితర కాలనీల్లో స్వయంగా తిరిగి లబ్ధిదారులను గుర్తించామని వివరించారు. గృహలక్ష్మి కింద ఇళ్ల మంజూరు ఉంటుందన్నారు.

8న కేటీఆర్ రాక

ఈనెల 8న రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ జడ్చర్లకు రానున్నట్లు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తెలిపారు. అర్హులయిన లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మంత్రి చేతుల మీదుగా పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్, కొండల్, దానీష్ పాల్గొన్నారు.



ఎర్రగుట్ట వద్ద డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



వివరాలు సేకరిస్తున్న సిబ్బంది

మహబూబ్‌నగర్ క్రైం: కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల అన్ని రకాల నేరాలను కట్టడి చేసే అవకాశం ఉంటుందని వన్‌టౌన్ సీఐ స్వామిగౌడ్ అన్నారు. కొత్త వ్యక్తులకు ఇంటిని అద్దెకు ఇచ్చే సమయంలో అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న బ్రహ్మణవాడిలో బుధవారం రాత్రి కమ్యూనిటీ కనెక్ట్ కార్యక్రమంలో భాగంగా ఇళ్లను తనిఖీలు నిర్వహించారు. మొత్తం 86ఇళ్లలో 179మందికి సంబంధించిన వివరాలను పరిశీలించారు. అదేవిధంగా సరైన పత్రాలు, నెంబర్ ప్లేట్ లేని 23ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో సీఐ మాట్లాడుతూ ఇటీవల సైబర్ నేరాలు క్రమంగా పెరుగుతున్నాయని అప్రమత్తంగా ఉండాలన్నారు. చిన్నారులకు సెల్‌ఫోన్స్ ఇవ్వడం వల్ల అనవసరమైన మెసేజ్‌లు క్లిక్ చేయడంతో ఇబ్బంది అవుతుందన్నారు. ఆఫర్స్, లింక్‌లు, బహుమతులు వచ్చాయని పంపే వాటిని ఓపెన్ చేయరాదన్నారు. దీంతో పాటు ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలన్నారు. మద్యం తాగి ఎవరూ వాహనాలు నడపరాదన్నారు.

లక్ష సంతకాల సేకరణ



నవాబుపేట: ఉపాధిహామీ సక్రమంగా అమలు చేసి కూలీలందరికీ న్యాయం చేయాలన్న లక్ష్యంతో మే 1 నుంచి 31 వరకు వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ ఆధ్వర్యంలో లక్ష సంతకాల కార్యక్రమం వివిధ జిల్లాల్లో నిర్వహించినట్లు యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మల్లెపాగ విజయలక్ష్మి తెలిపారు. బుధవారం వారు సంతకాలు సేకరించిన విషయంలో నవాబుపేటలో ఏపీఓకు వినతి పత్రం అందించారు. పథకాన్ని చట్టం ప్రకారం అమలు చేసి కూలీలకు రక్షణ కల్పించాలన్నారు. కూలీల హక్కులు కాలరాస్తే సహించేది లేదని వారు హెచ్చరించారు. అలాగే సంతకాల సేకరణ కార్యక్రమంలో కూలీలకు ఉపాధిహామీపై అవగాహన కల్పించామని తెలిపారు. కార్యక్రమంలో వెంకటయ్య, శ్రీనివాస్, నర్సింహులు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

‘డబుల్’ ఇళ్ల పంపిణీపై విచారణ చేపట్టాలి



చిన్నచింతకుంటలో తహసీల్దార్ సువర్ణరాజుకు వినతిపత్రం అందజేస్తున్న కురుమూర్తి గ్రామస్తులు

చిన్నచింతకుంట: మండలం కురుమూర్తి గ్రామంలో ప్రభుత్వం అందించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీపై అధికారులు విచారణ చేపట్టాలని బీజేపీ మండల నాయకుడు రాము డిమాండ్ చేశాడు. వెంటనే విచారణ చేపట్టి పేదలకు న్యాయం చేయాలని బుధవారం గ్రామస్తులతో కలిసి తహసీల్దార్ సువర్ణరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కురుమూర్తి గ్రామంలో ప్రభుత్వం నిరుపేదలకు 140 డబుల్ డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించిందన్నారు. కానీ అధికారులు, నాయకులు కుమ్మక్కై లబ్ధిదారుల ఎంపికలో అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. అర్హులకు కాకుండా గతంలో లబ్ధిపొందిన వారికే ఇళ్లను అందించారని మండిపడ్డారు. దీంతో నిరుపేదలకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్లు పొందిన వారు వేరేవారికి అమ్మి సొమ్ము చేసుకుంటున్నారన్నారు. అధికారులు వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

ఉత్సాహంగా చిత్రలేఖన పోటీలు

స్టేషన్ మహబూబ్‌నగర్: స్ఫూర్తి యువజన సామాజిక సేవా కళా సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పాత గౌతమి డిగ్రీ కళాశాలలో జిల్లాస్థాయి చిత్రలేఖన పోటీలు ఉత్సాహంగా నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయడానికి ఇలాంటి పోటీలు ఎంతగానో ఉపయోగపడుతాయని అన్నారు. విద్యార్థులు చదువుతోపాటు సాంస్కృతిక అంశాల్లో శిక్షణ తీసుకోవాలని కోరారు. స్ఫూర్తి యువజన సామాజిక సేవా కళా సంస్థ ప్రతినిధి జేపీ.మహేష్ కుమార్ మాట్లాడుతూ జిల్లాస్థాయి చిత్రలేఖన పోటీలకు విశేష స్పందన లభించినట్లు తెలిపారు. సబ్ జూనియర్ విభాగంలో ఎం.జాన్విత (ప్రథమ), బి.కేతన్ (ద్వితీయ), కె.భావిక (తృతీయ), జూనియర్ విభాగంలో కె.శ్రీవర్షిని (ప్రథమ), ఆర్.స్నేహ (ద్వితీయ), ఆర్.భావిక్ (తృతీయ), సీనియర్ విభాగంలో ఎస్.అర్చన (ప్రథమ), ఆశీ శర్మ (ద్వితీయ), బి.విజయ్‌కుమార్ (తృతీయ) స్థానాల్లో నిలిచినట్లు తెలిపారు. అనంతరం గాయని ఆర్.అనూష పాటలు పాడి అలరించారు. కార్యక్రమంలో పీపీ బెక్కం జనార్దన్, స్వరలహరి కల్చరల్ అకాడమీ అధ్యక్షులు నాయిని భాగన్నగౌడ్, డాక్టర్‌ప్రతిభ, ప్రముఖ కవి లక్ష్మణ్‌గౌడ్, మేకల శ్రీనివాస్, డీకే.ఆంజనేయులు, మేజీషియన్ నరేష్, కవి బోల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



గెలుపొందిన విద్యార్థులతో ప్రముఖులు

ప్రొటోకాల్ పాటించలేదని ఫిర్యాదు

మహమ్మదాబాద్: పల్లెబాట కార్యక్రమంలో భాగంగా మే17న అన్నారెడ్డిపల్లి గ్రామంలో పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి పలు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల్లో ఏర్పాటు చేసిన శిలాఫలకాలపై తమ పేరు లేకుండా అవమానపరిచారని, ప్రోటోకాల్ పాటించలేదంటూ ఎంపీటీసీ లక్ష్మి ఎంపీడీఓ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఒక ఎస్టీ మహిళ, అందులోనూ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంపీటీసీ కావడం వల్లే ఇలా చేశారని ఆరోపించారు. తానుకూడా ప్రజలు ఎన్నుకున్న ఓ ప్రజాప్రతినిధినే అంటూ ఆవేదన వ్యక్తంచేశారు. కార్యాలయంలో ఎంపీడీఓ లేకపోవడంతో జూనియర్ అసిస్టెంట్ హరిప్రసాద్‌కు ఫిర్యాదును అందించారు.

హైవేపై అడ్డదిడ్డంగా పార్కింగ్

అడ్డాకుల: మూసాపేట మండలం సంకలమద్ది స్టేజీ శివారులోని జాతీయ రహదారిపై లారీలు, కార్లను అడ్డదిడ్డంగా నిలుపుతున్నారు. రహదారి పక్కన ఉన్న హోటళ్ల ముందు రహదారి నిర్వాహణ సంస్థ ఆధ్వర్యంలో కాల్వను తీసి వాహనాలు రోడ్డు కిందకు రాకుండా చేశారు. అయితే వాహనదారులు రోడ్డు కిందకు దిగకుండా ప్రధాన రోడ్డుపైనే వాహనాలను నిలుపుతున్నారు. దీనివల్ల ప్రమాదం పొంచి ఉందని ప్రజలు అంటున్నారు. లారీలు, కార్లను రహదారిపై నిలపడంతో అక్కడే ఉన్న మలుపు వద్ద వేముల వైపు నుంచి వచ్చే వాహనాలకు ఇబ్బందులు తప్పడం లేదని అంటున్నారు. చాలాసార్లు ఇక్కడ ప్రమాదాలు తృటిలో తప్పిపోయిన సందర్భాలు ఉన్నాయి. హోటళ్ల ముందు వాహనాలు నిలపకుండా కాల్వవ తీసిన రోడ్డు నిర్వాహకులు ఇక్కడ ప్రధాన రోడ్డుపై వాహనాలు నిలపకుండా చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారు. దీనివల్ల ఇక్కడ ఎప్పుడు ప్రమాదాలు చోటుచేసుకుంటాయో చెప్పలేని పరిస్థితి ఉంది. ఇక్కడ సంకలమద్ది వైపు నుంచి రాంగ్‌రూట్లో వచ్చే వాహనాలకు ప్రధాన రోడ్డుపై నిలిచే వాహనాలతో ముప్పు పొంచి ఉంది. ఇదిలా ఉండగా రహదారిపై ప్రమాదాల నివారణకు పోలీసులు హైవే కూడళ్ల వద్ద స్టాపర్లను కూడా ఏర్పాటు చేశారు. రహదారిపై వాహనాలు నిలపకుండా చేయాలని స్థానిక పోలీసులకు జిల్లా ఉన్నతాధికారులు సూచనలు చేశారు. ఈనేపథ్యంలోనే చొరవ తీసుకుని ప్రధాన రోడ్డుపై వాహనాలు నిలపకుండా తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది.



సంకలమద్ది స్టేజీ వద్ద కాల్వ పక్కన హైవేపై నిలిచిన లారీలు